

నేడు జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రి రాజా



ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దాడిశెట్టి రాజా ఈ నెల 14న జిల్లాకు రానున్నట్లు జిల్లా సమాచార శాఖ అధికారులు ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు తుని నుండి రోడ్డు మార్గాన బయలుదేరి రాత్రి 8.30 గంటలకు భీమవరం చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. 15వ తేదీ ఉదయం తొమ్మిది గంటల నుండి స్థానిక కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొననున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట నుండి రెండు గంటల వరకూ భోజన విరామం అనంతరం భీమవరం నుండి బయలుదేరి రోడ్డు మార్గాన తుని వెళ్లనున్నట్లు వెల్లడించారు.

'పొత్తు' పొడిచేనా..!

ఎన్నికల పొత్తులపై రాజకీయ నేతల్లో చర్చ
టిడిపి, జనసేనలపై ప్రజల సమాలోచనలు
పొత్తు కుదిరితే సీట్ల పంపకంపైన ఊహాగానాలు
జనసేన వారాహి యాత్రతో కార్యకర్తల్లో మరింత ఉత్సాహం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏడాదిలోపే అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో ఎన్నికల పొత్తులపై జిల్లా రాజకీయాల్లో చర్చలు మొదలయ్యాయి. ముఖ్యంగా టిడిపి, జనసేన పొత్తుపై ఆయా పార్టీనాయకులతో పాటు జనాల్లోనూ తీవ్ర చర్చ కొనసాగుతోంది. గ్రామ, పట్టణాల్లో ఏ ఇద్దరు కలిసినా టిడిపి, జనసేన పొత్తుగురించి మాట్లాడుకుంటున్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ జిల్లాలో చేపట్టిన మొదటివిడత వారాహి యాత్ర ఆపార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపినట్లు కనిపిస్తోంది. ఆ పార్టీ నాయకులు వివిధ కార్యక్రమాలను వేగవంతం చేశారు. ఇటీవల అడవికొలను, నిడమర్రు రోడ్డు గురించి ఆ పార్టీ నాయకులు చేపట్టిన పాదయాత్ర అంతటా చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల్లో పొత్తు కుదరకపోతే టిడిపి, జనసేన ఇరు పార్టీలూ నష్టపోతాయని, పొత్తు కుదిరితే జిల్లాలో అన్నిసీట్లు గెలుచుకునే అవకాశం ఉంటుందని ఇరుపార్టీల నాయకులు అంచనా వేస్తున్నారు. అదేసమయంలో పొత్తుకుదిరితే జనసేనకు ఏయే సీట్లు ఇస్తారన్న అంశంపైనా జనాల్లో చర్చ నడుస్తోంది. రెండు జిల్లాలోనూ 14 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలున్నాయి. 2014 ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేన పొత్తుతో ముందుకు సాగాయి. జనసేన ప్రత్యక్షంగా అభ్యర్థులను పోటీకి దింపకపోయినా టిడిపికి అండగా నిలిచింది. దీంతో ఉమ్మడిజిల్లాలోని 15 సీట్లను టిడిపి కైవసం చేసుకుంది. పొత్తులో భాగంగా తాడేపల్లిగూడెం అసెంబ్లీ, నరసాపురం ఎంపీస్థానాల్లో బిజెపి అభ్యర్థులు గెలిచారు. 2019లో పొత్తులేకుండా టిడిపి, జనసేన , బిజెపి ఒంటిరిగా ఎన్నికల బరిలోకి దిగాయి. దీంతో 15 స్థానాలకుగాను వైసిపి 13 స్థానాలను గెలుచుకోగా, టిడిపి రెండుస్థానాలకే పరిమితమైంది. జనసేన ఒక్కసీటు కూడా గెలుచుకోలేదు. భీమవరం స్థానంలో పోటీచేసిన జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ సైతం ఓటమిపాలయ్యారు. నరసాపురం, తాడేపల్లిగూడెం, భీమవరం వంటి స్థానాల్లో జనసేన అభ్యర్థులు రెండోస్థానంలో నిలిచినప్పటికీ గెలుపుమాత్రం సాధించలేకపోయారు. ఓట్లు విడిపోవడం కారణంగా వైసిపికి అత్యధిక సీట్లు వచ్చాయని టిడిపి, జనసేన నాయకులు అంచనా వేశారు. ఈసారి పొత్తుతోనే ఎన్నికల బరిలో దిగాలని జనసేన భావిస్తోంది. అందుకు తగినట్లుగానే జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ సంకేతాలు ఇస్తూ వస్తున్నారు. ఉమ్మడి పశ్చిమలో కాపు సామాజిక తరగతి జనాభా ఎక్కువగా ఉంది. కాపు సామాజిక తరగతి ఈసారి జనసేన వైపు నిలిచే అవకాశం ఉన్నట్లు లెక్కలు కడుతున్నారు. దీంతో పొత్తుపెట్టుకుంటే రెండు జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాలను గెలుచుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. రోడ్లు వేయకపోవడం, తాగునీరు గురించి పట్టించుకోకపోవడం, చెత్తపన్ను, విద్యుత్ బిల్లుల పెంపు, ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు వంటి అనేక అంశాలు అధికార పార్టీ వైసిపికి ఇబ్బందిగా మారే పరిస్థితి కనిపిస్తోంది.

జనసేన పోటీ ఏయే స్థానాల్లో?

పొత్తు కుదిరితే జనసేన జిల్లాలో ఐదుస్థానాల్లో పోటీచేసే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. నరసాపురం, తాడేపల్లిగూడెం, భీమవరం, ఉంగుటూరు, ఏలూరు నుంచి పోటీ చేయనున్నట్లు ప్రచారం సాగుతోంది. గత ఎన్నికల్లోనూ ఈ స్థానాల్లో జనసేన తన ప్రభావం చూపింది. అయితే ఆయా స్థానాల్లో టిడిపికి బలమైన అభ్యర్థులున్నారు. జిల్లా టిడిపి అధ్యక్షులు గన్ని వీరంజనేయులు ఉంగుటూరుకు, ఏలూరుకు బడేటి బుజ్జి సోదరుడు చంటి, తాడేపల్లిగూడేనికి ముళ్లపూడి బాపిరాజు వంటి సీనియర్ నాయకులున్నారు. పొత్తులో ఈ సీట్లు జనసేనకు ఇస్తే రాజకీయంగా ఇబ్బందులు వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో పొత్తు కుదిరితే సీట్ల సర్దుబాటు ఏవిధంగా ఉంటుందోనన్న చర్చ సర్వత్రా నడుస్తోంది. ఏది ఏమైనా టిడిపి, జనసేన పొత్తుఖాయమన్న రీతిలో ఆయా పార్టీల నాయకులు చెబుతున్న పరిస్థితి నెలకొంది. పొత్తు పొడుస్తుందో లేదో వేచిచూడాల్సి ఉంది.

బాలలకు రక్ష.. మిషన్ వాత్సల్య

ఉమ్మడి జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సూర్యచక్రవేణి




ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను, బాలలతో భిక్షాటనను, బాల్య వివాహాలను, బాలల అక్రమ రవాణాను అరికట్టేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్.సూర్య చక్రవేణి తెలిపారు. ఈ సంవత్సరంలో ఇప్పటివరకూ ఎంతమంది బాల కార్మికులను గుర్తించారు, ఎన్ని బాల్య వివాహాలను అడ్డుకున్నారు, బాలల సంరక్షణకు ఎలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు వంటి ప్రశ్నలకు ప్రజాశక్తి ముఖాముఖిలో ఆమె సమాధానాలిచ్చారు.

ప్రశ్న : మహిళా శిశు సంక్షేమ శాఖలో బాలల సంరక్షణ అధికారి ముఖ్య విధులు ఏంటి?

ముఖ్యంగా 18 ఏళ్లలోపు బాలబాలికలకు ఇంటిలో, బడిలో, సమాజంలో ఏ కష్టం వచ్చినా బాలల న్యాయ చట్టం ప్రకారం వారికి న్యాయం చేయడం, వారి హక్కులను కాలరాసే వారిపై చర్యలు తీసుకోవడం మా శాఖ యొక్క ముఖ్య ఉద్దేశం. ఇందుకోసం మిషన్ వాత్సల్య పేరుతో ప్రత్యేక కార్యక్రమం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించబడుతుంది.



ప్రశ్న : బాలకార్మికుల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు ఏమైనా తీసుకుంటున్నారా? ఇప్పటివరకూ ఈ సంవత్సరం ఎంతమంది బాల కార్మికులను గుర్తించారు?

బాల కార్మికుల నిర్మూలనకు నెల రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాము. ఈ డ్రైవ్ లో భీమవరం, ఏలూరు ప్రాంతాల నుంచి 36 మంది బాలకార్మికులను గుర్తించి వారిని వివిధ పాఠశాలల్లో చేర్పించడం జరిగింది. కార్మిక శాఖ వీరిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వీరి బాగోగులు చూడటం జరుగుతుంది.

ప్రశ్న : బాల్యవివాహాల నిరోధానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? ఈ సంవత్సరం ఎన్ని బాల్యవివాహాలను నిలుపుదల చేసి, కేసులు నమోదు చేశారు?

బాల్య వివాహాల నిరోధాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఇటీవల జిఒ31ని విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ ఆర్‌డిఒ నోడల్ అధికారులుగా ఉండి నెలనెలా ఈ కార్యక్రమంపై సమీక్ష చేయటం జరుగుతుంది. అలాగే గ్రామాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి, మహిళా సంరక్షణ కార్యదర్శి ఎప్పటికప్పుడు ఆయా గ్రామాల్లో సమాచారాన్ని సేకరించి 18 సంవత్సరాలలోపు బాల బాలికలు కచ్చితంగా చదువుకునేలా చర్యలు తీసుకుంటున్నాము. ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచి 19 బాల్య వివాహాలను గుర్తించాము. ఐదు వివాహాలపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశాము.

ప్రశ్న : జిల్లాలో ఇప్పటి వరకూ ఎన్ని పోక్సో కేసులు నమోదు చేశారు?

ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకూ 12 పోక్సో కేసులు నమోదు చేశాము. పోలీస్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఆ కేసులను పోలీసు శాఖ ద్వారా చేపట్టాము.

ప్రశ్న : ఈ సంవత్సరం ఎంతమంది పిల్లలను దత్తత ఇచ్చారు? దత్తత తీసుకోవాలంటే ఎలాంటి నిబంధనలుంటాయి?

జిల్లాలో ఈ సంవత్సరం ఎనిమిది మంది పిల్లలను దత్తత ఇచ్చాము. పిల్లలను దత్తత తీసుకోవాలంటే ముందుగా ఎవరైతే పిల్లలు కావాలని అనుకుంటున్నారో వారి వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, వయస్సు, ఆదాయం, ఆరోగ్య పరిస్థితి తదితర డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఏ ఏజన్సీ నుంచి పిల్లను దత్తత తీసుకోవాలని అనుకుంటున్నారో ఆ ఏజన్సీని సెలెక్ట్ చేసుకోవాలి. వారి డాక్యుమెంట్లు మాకు అందిన తర్వాత 30 రోజుల్లో వారి ఇంటికి వెళ్లి అన్నివివరాలు విచారించి సరిగ్గా ఉంటే మళ్లీ మేము ఆ వివరాలు సంబంధిత పోర్టల్‌లో అప్లోడ్ చేస్తాము. ఆ తర్వాత సీనియార్టీ ప్రకారం వారివంతు వచ్చినప్పుడు వారికి కబురు చేసి, వారు వచ్చి చూసుకుని పిల్లల నచ్చితే తాత్కాలికంగా వారికి అప్పగిస్తాము. తరువాత 60 రోజుల్లో వారు జిల్లా కలెక్టర్ ముందు హాజరైతే అన్ని చూసుకుని సరిగ్గా ఉంటే వారికి పర్మినెంట్‌గా దత్తత ఇస్తాము.

ప్రశ్న:6 నుంచి 18 ఏళ్లలోపు పిల్లలను సంరక్షించే బాలసదన్‌లు జిల్లాలో ఎక్కడెక్కడ ఉన్నాయి? వారిని ఎవరు దత్తత తీసుకోవడానికి ముందుకు రాకపోతే వారిని ఏం చేస్తారు?

జిల్లాలో బాలసదన్‌లు దెందులూరు నూజివీడు తణుకు ఆకివీడు ప్రాంతాల్లో ఉన్నాయి. పెద్ద పిల్లలను ఎవరు దత్తత తీసుకోవడానికి ముందుకు రాకపోతే వారిని కస్తూరిబా బాలిక పాఠశాలలో చదివించడం జరుగుతుంది. చదువుతోపాటు వివిధ నైపుణ్య శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగం వచ్చేవరకూ మేమే సంరక్షించడం జరుగుతుంది. ఉద్యోగం వచ్చిన తర్వాత వారికి ఇష్టం అయితే మేమే వివాహం కూడా చేయడం జరుగుతుంది. లేకపోతే వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్లో ఉంచి పర్యవేక్షించడం జరుగుతుంది.

ప్రశ్న : జిల్లాలో ఇటీవల బాలల భిక్షాటన ఎక్కువగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో వారిని అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? ఇప్పటివరకూ ఎంతమందిని గుర్తించారు?

బాలల భిక్షాటన అరికట్టేందుకు పోలీస్ డిపార్ట్‌మెంట్‌తో కలిసి అప్పుడప్పుడు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌తో పాటు విద్యాశాఖ కూడా బాధ్యతవహించి బాలల భిక్షాటనను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించాము. జిల్లాలో ఇప్పటివరకూ 40 మందిని గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించాము.

ప్రశ్న : బాల కార్మికవ్యవస్థ, బాల్య వివాహాలు, బాలల భిక్షాటనను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు చివరిగా ప్రజలకు మీరిచ్చే సూచన ఏంటి?

మన దేశంలో ప్రతి పౌరుడికీ హక్కులున్నట్టే బాలలకు కూడా కొన్ని ప్రత్యేక హక్కులున్నాయి. బాలలు ఎట్టి పరిస్థితుల్లోనూ బడిబయట ఉండకూడదు. బాలలతో భిక్షాటన చేయించటం, బాలలను పనిలో పెట్టుకోవడం, బాల్యవివాహాలు చేయడం నేరం. దీన్ని అరికట్టడం ప్రతి పౌరుడూ తమబాధ్యతగా అనుకోవాలి. ఎక్కడైనా ఇలాంటి సంఘటనలు కనిపిస్తే 1098 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారమిస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. గతంలో ఈ నంబరు ఎన్‌జిఒ అధీనంలో ఉండేది. ఇప్పుడు మా శాఖ అధీనంలోకి వచ్చింది కాబట్టి ఎవరైనా సమాచారమిస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుని బాలల హక్కులు కాపాడేందుకు పూర్తిస్థాయిలో ప్రయత్నిస్తున్నాము.

దేశాభివృద్ధిలో పరిశోధనలు ఎంతో కీలకం

పద్మశ్రీ అవార్డు గ్రహీత, సైయంట్ లిమిటెడ్ కంపెనీ ఛైర్మన్ మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దేశ సమగ్రాభివద్ధిలో పరిశోధనలు ఎంతో కీలకమని, వాటి ద్వారా సిద్ధించే నవకల్పనలు ప్రజల జీవితాలను మెరుగుపరుస్తాయని పద్మశ్రీ అవార్డు గ్రహీత, సైయంట్ లిమిటెడ్ కంపెనీ ఛైర్మన్ డాక్టర్ బివిఆర్ మోహన్ రెడ్డి తెలిపారు. ఎపి నిట్‌లో విద్యానభ్యసించిన 2019-2023 బ్యాచ్ విద్యార్థులకు ఐదో స్నాతకోత్సవాన్ని ప్రాంగణంలోని రవీంద్ర కళాభారతి ఆడిటోరియంలో ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే అధ్యక్షతన ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి మోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దటంతోపాటు వారి ఉన్నతికి అవసరమైన లోకజ్ఞానాన్ని అందించేవి విద్యాలయాలేనని చెప్పారు. నిట్ విద్యార్థులు క్వాంటం కంప్యూటింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, మానవ రహిత వైమానిక వాహనాలు వంటి విభాగాల్లో పరిశోధనలు చేస్తుండంతోపాటు పేరెన్నికగన్న పలు కంపెనీల్లో ఉద్యోగాలను దక్కించుకోవడం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థుల్లో దాగివున్న సహజ ప్రతిభా నైపుణ్యాలను వెలికితీయటంలో గురువుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ టెక్నాలజీ ఎంతో అభివృద్ధి సాధించిందని తెలిపారు. కోవిడ్-19 నివారణ టీకాను అందుబాటులోకి తీసుకురావడానికి పదేళ్ల సమయం పట్టేదని, కానీ సాంకేతిక సహాయంతో ఏడాదిలోనే తీసుకొచ్చారని చెప్పారు. విద్యార్థులు విభిన్న ఆలోచనలు చేస్తూ కొత్త కొత్త ప్రాజెక్టులు, ఆవిష్కరణల రూపకల్పనకు కృషి చేయాలన్నారు. దేశాభివృద్ధిలో స్టార్టప్‌లు, సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి సంస్థలు కీలక పాత్ర పోషిస్తూ 60 శాతం ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నాయని చెప్పారు. యువత సొంతంగా కంపెనీలను స్థాపించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని వివరించారు. బోర్డ్ ఆఫ్ గవర్నర్ ఛైర్‌పర్సన్ డాక్టర్ మదుల రమేష్ మాట్లాడుతూ మనదేశ యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, విద్యార్థులు ఆధునిక కాలానికి అనుగుణంగా తమ ఆలోచనా విధానాన్ని మార్చుకుని ముందడుగు వేస్తే ఎన్నో అద్భుతాలను సృష్టించవచ్చని వివరించారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ప్రమోద్ పడోలే మాట్లాడుతూ జీవితంలో ప్రతీ క్షణం ఎంతో విలువైనదని, గడిచిన క్షణం తిరిగిరాదనే విషయాన్ని ప్రతి విద్యార్థీ గుర్తుంచుకోవాలని సూచించారు. శాస్త్ర, సాంకేతికత, ఇంజనీరింగ్, గణిత రంగాలు వంటి స్టెమ్ కోర్సుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో అపార అవకాశాలు ఎదురుచూస్తున్నాయని వాటిని అందిపుచ్చుకునే స్థాయికి విద్యార్థులు ఎదగాలని వివరించారు. అనంతరం నాలుగు సంవత్సరాల ఇంజనీరింగ్ కోర్సును పూర్తి చేసుకున్న 458 బిటెక్ విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయడంతోపాటు కోర్సులవారీగా అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన ఎనిమిది మంది విద్యార్థులకు, ఆ బ్యాచ్‌లో అద్భుత ప్రతిభను కనబరిచి టాపర్‌గా నిలిచిన సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థి వేముల సాయి శ్రీనివాస్‌కు బంగారు పతకాలను అందజేశారు. వీరితోపాటు ఎంటెక్ విద్యను పూర్తి చేసిన 50 మంది విద్యార్థులతోపాటు ఎనిమిది కోర్సుల్లో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన తొమ్మిది మందికి, అలాగే పిహెచ్‌డి కోర్సులను దిగ్విజయంగా పూర్తిచేసిన 12 మంది పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్‌లు డాక్టర్ జిఆర్‌కె శాస్త్రి, డాక్టర్ టి.కురుమయ్య, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ జిబి.వీరేష్ కుమార్, డాక్టర్ కార్తీక్ శేషాద్రి, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వి.సందీప్, బోర్డ్, సెనేట్ సభ్యులు, ఆచార్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి


రామరాజును సత్కరిస్తున్న డిఇఒ రమణ

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

డిఇఒ ఆర్‌వి.రమణ

ప్రజాశక్తి - కాళ్ల

అంబేద్కర్ ఆశయాల సాధన కోసం ప్రతిఒక్కరు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్‌వి.రమణ అన్నారు. స్థానిక సీసలి గ్రీన్ వ్యూ ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాలులో ఆదివారం ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ బహుజన సమాఖ్య రెండో వార్షికోత్సవ వేడకను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ బహుజన సమాఖ్య అధ్యక్షులు, ఫౌండర్ సోడదాసి గంగయ్య అధ్యక్షత వహించి మాట్లాడారు. దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన అంబేద్కర్ అని, ఆయన అడుగుజాడల్లో నడుస్తామని చెప్పారు. ఈ సమాఖ్య విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఆయన ఆశయాన్ని కొనసాగించేందుకు ఈ సమాఖ్య కృషి చేస్తుందన్నారు. ఉండి, ఆకివీడు, పాలకోడేరు, కాళ్ల మండలాల్లో పదోతరగతిలో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఒక్కొక్కరికి రూ.ఐదు వేల నగదు బహుమతిని డిఇఒ చేతులమీదుగా అందించారు. కాళ్లకూరు గ్రామానికి చెందిన దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ దాట్ల వెంకట రామరాజుకు రాజా రామ్మోహన్‌రాయ్ సేవా రత్న అవార్డును అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆకివీడు సిఐ సత్యనారాయణ, ఎస్‌ఐ ఎజిఎస్.మూర్తి, మంచాల ఐజక్, సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ, ఎ.వీరయ్య, సోడదాసీ జయపాల్, మహమ్మద్ సిద్దిక్, సంఘ సభ్యులు గాతల సందీప్, కొండా రాజేష్ కుమార్, బొర్రా పార్థు, గుడిసే అనిల్, గ్రామ సర్పంచులు నందమూరి ప్రకాష్, గాలి సామ్రాజ్యం పాల్గొన్నారు.

పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ద్విచక్ర, ప్రత్యేక వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఇసుక తెన్నెలపై ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో ఆటలాడుకున్నారు. అనంతరం ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేదతీరారు.

రైలు ఛార్జీలు తగ్గించాలని ఆందోళన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పెంచిన రైల్వే టికెట్ ఛార్జీలు తగ్గించాలని, రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్ల పునరుద్ధరించాలని, రైల్వే ప్రయివేటీకరణ నిలుపుదల చేయాలని సిపిఎం పెంటపాడు మండల కమిటీ, తాడేపల్లిగూడెం తాలూకా రైల్వే గుడ్ షెడ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు పెంటపాడులో ఆదివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా చిర్ల పుల్లారెడ్డి, సత్తి కోదండరామి రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కరోనా వచ్చినప్పటి నుంచి ప్యాసింజర్ రైళ్లు రద్దు చేసిందన్నారు. కరోనాకు ముందే విజయవాడ-విశాఖపట్నం ప్యాసింజర్ రైలు రద్దు చేసిందని తెలిపారు. అన్ని రైళ్లను ఎక్స్‌ప్రెస్‌గా మార్చి సామాన్యులు రైలు ప్రయాణానికి భయపడేటట్లుగా టికెట్ రేట్లు పెంచిందన్నారు. రైల్వేను ప్రయివేటుపరం చేయడంతో, లక్షలాది పోస్టులు భర్తీ చేయకపోవడంతో, అన్ని పోస్టులు కాంట్రాక్టు ఇవ్వడంతో రైలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ నెల ఐదో రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పేరుతో ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారన్నారు. ఆధునికీకరణ చేసి ప్రయివేట్‌వారికి అప్పజెప్పడానికేనన్నారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్లు తిరిగి పునరుద్ధరించాలని, టిక్కెట్ ఛార్జీలు తగ్గించాలని, రైల్వే ప్రయివేటీకరణ నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కర్రి సాయిరెడ్డి, అడపా ఆంజనేయులు, గాది వెంకట్రావు, ఎస్‌విఎస్.రెడ్డి, కర్రి సుబ్బిరెడ్డి, ఎ.నారాయణ, బుద్దాల నాని, మద్దాల పుత్రయ్య, ఆండ్రపు కృష్ణ, అడ్డగర్ల కృష్ణ, కర్రి శ్రీనివాస్‌రెడ్డి, టిఎస్.రెడ్డి, జివి.భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు : ఎఎస్‌పి సుబ్బరాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదిగి మంచి భవిష్యత్తును అందుకోవాలని జిల్లా అడిషనల్ ఎస్‌పి ఎవి.సుబ్బరాజు క్రీడాకారులకు సూచించారు. రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ అండర్ 20 బాయ్స్, గర్ల్స్ ఛాంపియన్‌షిప్ 23 - 24 పోటీలు ఆదివారం భీమవరం ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రారంభమయ్యాయి. ప్రారంభ కార్యక్రమానికి ఫెన్సింగ్ రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శి జిఎస్‌వి.కృష్ణమోహన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా సుబ్బరాజు మాట్లాడారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్నప్పటికీ క్రీడల్లో ఆ లోటు కొంత కనపడుతుందన్నారు. దానిని పూడ్చేందుకు యువ క్రీడాకారులు మంచి పట్టుదలతో క్రీడల్లో రాణించాలన్నారు. ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీ రింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి జిఎస్‌వి. కృష్ణమోహన్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్, ఫెన్సింగ్ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ పి.సత్యనారాయణ రాజు, కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు, ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చల్లా రాము, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్.హరిమోహన్, జి.సారిక, అవినాష్ పాల్గొన్నారు.

తాగునీరు అందించాలని మహిళల ధర్నా

ప్రజాశక్తి - పాలకొల్లు

తాగునీరు అందించాలని పాలకొల్లు బైపాస్ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక జర్నలిస్ట్ కాలనీలోని బలహీన వర్గాల ప్రజలు కోరారు. ఈ మేరకు ఆదివారం కాలనీ వద్ద మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ కొంతకాలంగా సీనియర్ జర్నలిస్టు కాగిత సూర్యనారాయణ తన సబ్ మెర్సిబుల్ పంపు నుంచి తాగునీరు ఇచ్చేవారన్నారు. అయితే ఇటీవల మోటార్ కాలిపోవడంతో తాగునీరు లేక అవస్థలు పడుతున్నామని వాపోయారు. తమ సమస్య పరిష్కరించాలని రూరల్ పంచాయతీ కార్యదర్శిని అడిగితే పంచాయతీ విలీనమైందని, మున్సిపల్ కమిషనర్‌ను అడగాలని చెబుతున్నారన్నారు. కమిషనర్‌ను అడిగితే ఇంకా విలీనం కాలేదని చెబుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు వద్దకు వెళ్లగా కొన్ని రోజులు వాటర్ ట్యాంక్ పంపుతానని, శాశ్వత పరిష్కారం అధికారులు చేయాలని చెప్పారని తెలిపారు. దీంతో మహిళలు తమ సమస్య పరిష్కరించాలని ఖాళీ బిందెలతో ధర్నా చేశారు.


ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

పెన్నాడ బైట్ కళాశాలకు నాక్ 'ఎ' గ్రేడ్

కళాశాల ఛైర్మన్ శ్రీవెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న శ్రీవెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకోడేరు

భీమవరం ఇన్‌స్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (పెన్నాడ బైట్) కళాశాలకు నాక్ 'ఎ' గ్రేడ్ కు ఎంపికైందని కళాశాల ఛైర్మన్ ఎ.శీవెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. గత నెల 26, 27న నాక్ ఫేర్ టీమ్ కళాశాలను సందర్శించిందని, కళాశాలలో విద్యా ప్రమాణాలు, లేబోరేటరీ తదితర సౌకర్యాలను పరిశీలించి రిపోర్ట్‌ను బెంగుళూరులోని నాక్ హెడ్ క్వార్టర్స్‌కు పంపిందని తెలిపారు. అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తున్నందుకుగాను తమ కళాశాలకు నాక్ 'ఎ' గ్రేడ్ ప్రకటించారని తెలిపారు. 2007లో స్థాపించిన బైట్ కళాశాల ఎఐసిటిఇ, జెఎన్‌టియుకె వారి గైడెన్స్ ప్రకారం ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన చేస్తూ ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నామని తెలిపారు. దానితో పాటు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ప్రతీ సంవత్సరం 80 శాతంపైగా విద్యార్థులకు ఎంఎన్‌సి కంపెనీల్లో ఉద్యోగాలు పొందడానికి తగిన శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. కళాశాలకు నాక్ 'ఎ' గ్రేడ్ వచ్చినందుకు ఆనందిస్తున్నామన్నారు. కళాశాల వైస్‌ఛైర్మన్ టివివి.ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సురేష్ మాట్లాడుతూ ఐదేళ్ల కాలపరిమితి ఈ గ్రేడ్‌కు ఉంటుందని తెలిపారు. విద్యార్థుల అభ్యున్నతికి కళాశాలలో అన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. యాజమాన్యాలు, ప్రిన్సిపల్ అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది సమిష్టి కృషితో 16 ఏళ్లుగా అభివృద్ధి పథంలో కాలేజీ నడుస్తుందని, క్రమశిక్షణకు మారుపేరుగా ఈ కళాశాల తీర్చిదిద్దామని కళాశాల విద్యార్థులకు సంపూర్ణంగా బస్సు సౌకర్యం కల్పించడం, మిగిలిన సౌకర్యాలు కూడా సంపూర్ణంగా అందిస్తామని తెలిపారు. నాక్ అక్రిడేషన్ సాధించడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్, సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ బైట్ ఇంజనీరింగ్ కళాశాల, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ గత దశాబ్ద కాలంగా జిల్లావ్యాప్తంగా అన్ని విభాగాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. ముఖ్యంగా కరోనాలో ఈ కళాశాల బడుగు బలహీన వర్గాలకు చేసిన సేవలు అద్వితీయమని కొనియాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అనేక ప్రాంతాల్లో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటామన్నారు. ఈ సమావేశంలో కళాశాల సెక్రటేరియట్ కరస్పాండెంట్ ఎ.శ్రీహరి, కళాశాల డైరెక్టర్‌లు ఎ.హర్ష తేజశ్రీ, ఎఎస్‌ఎస్‌ఆర్.తేజ, డాక్టర్ కె.భాస్కరరావు, యు.వినోద్, సుంకర మంగతాయారు, భీమవరం పట్టణ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని సిపిఎం నిరసన

ప్రజాశక్తి - తణుకు రూరల్

వేల్పూరు గోస్తని కాలువ ఒడ్డున ఉన్న శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి అభివృద్ధి చేయాలని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు డిమాండ్ చేశారు. శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ గ్రామంలో శ్మశానవాటిక అస్తవ్యస్తంగా ఉందన్నారు. శ్మశానంలో పిచ్చి మొక్కలు, ముళ్లకంపలు, చెత్త చెదారంతో చిట్టి అడవిలా ఉందన్నారు. వర్షాకాలంలో కొద్దిపాటి వర్షానికే ఈ శ్మశానం ముంపునకు గురవుతుందన్నారు. ఆ సమయంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశానవాటికలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి సమయంలో చనిపోయిన వారిని తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించాలంటే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ఈ శ్మశానవాటికలో అభివృద్ధి పనులు చేపట్టి మౌలిక వసతులు కల్పించాలని గ్రామపంచాయతీ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, అధికార పార్టీ నాయకులకు వినతిపత్రాలు అందించి రెండేళ్లు దాటినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశానవాటిక అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ శాఖ కార్యదర్శి వాసా వెంకటేశ్వరావు, రేవడి అంజి, కరేళ్ల మల్లికార్జునరావు, కుడక వీరభద్రరావు, కరేళ్ల రాంబాబు, తాడిశెట్టి వెంకటేశ్వరరావు, కరేళ్ల అర్జున్, తాళ్ల గణేష్, రేవడి వీరబాబు, విశ్వనాథం, మహేష్, రేవడి వీరబాబు పాల్గొన్నారు.


శ్మశానవాటికలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు


త్రివర్ణ పతాకాలు పంపిణీ చేస్తున్న ఇఒపిఆర్‌డి రాంప్రసాద్

పంచాయతీ సిబ్బందికి జాతీయ జెండాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ప్రభుత్వ కార్యాలయంపైన త్రివర్ణ పతాకం ఎగర వేయాలని ఇఒపిఆర్‌డి పివిఎస్.రాంప్రసాద్ అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ సిబ్బందికి జాతీయ జెండాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ మండలంలో 18 పంచాయతీలకు 300 జెండాలను గ్రామానికి 16 చొప్పున అందించారు. ఆగస్టు 15 నేపథ్యంలో త్రివర్ణ పతాకాన్ని పంచాయతీ, హైస్కూల్, పాఠశాల, సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం, రైతు భరోసా కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయాలపై ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

పాలకొల్లు : ఆగస్టు 15వ తేదీన ప్రతి ఇంట జాతీయ జెండా ఎగుర వేయాలని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు రమణ స్వామి అన్నారు. పాలకొల్లు యడ్లబజార్‌లో ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం జాతీయ జెండాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమణస్వామి మాట్లాడుతూ భరత మాత దాస్య శృంఖలాలు తొలగి భారతావనికి స్వాతంత్ర్యం సిద్ధించిన రోజు ప్రతి ఇంట జాతీయ జెండా ఎగురవేయడం కర్తవ్యమని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయలు వలివేటి చిరంజీవిశర్మ, గోటేటి రామస్వామి, రమణ గురు స్వామి సభ్యులు పాల్గొన్నారు.

25న చలో విజయవాడ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - గణపవరం

విఆర్‌ఎల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25వ తేదీన నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు గణపవరం మండల కమిటీ అధ్యక్షులు మేడిశెట్టి పెంటారావు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో విఆర్‌ఎల మండల కమిటీ అధ్యక్షులు ఎరిచెర్ల వెంకట్రావు అధ్యక్షతన మండల విఆర్‌ఎల సమావేశం సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేడిశెట్టి పెంటారావు మాట్లాడుతూ 2017లో విఆర్‌ఎలకు ఇచ్చిన హామీలు సిఎం జగన్ అమలు చేయాలన్నారు. బ్రిటిష్ కాలం నుంచి పని చేస్తున్న విఆర్‌ఎలకు కనీస వేతనాలు అమలు చేయడంలేదని, వారితో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీనియార్టీగా ఉన్న వారికి ప్రమోషన్లు ఇవ్వాలని, నామినీలు భర్తీ చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈ నెల 25న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమంలో విఆర్‌ఎలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కమిటీ ఉపాధ్యక్షులు గడ్డం పట్టాభి, కార్యదర్శి పిల్లి శ్రీనివాసు, రేవాటి నరసయ్య, మోతే వెంకటలక్ష్మి, గడ్డం తులసి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన

ప్రజాశక్తి - ఆకివీడు



కళాకారుల నాట్యప్రదర్శన

స్థానిక లలిత కళా సాంస్కృతిక సంస్థ శారదా కళా సమితి ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం రాత్రి భరతనాట్య ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భరతనాచల్ దేశ విదేశాల్లో భారతీయ నాట్య ప్రదర్శనకు అద్దం పట్టిన ప్రముఖులుగా మన్నంలో పొందిన లక్ష్మీ మహంతి, శంకర్ సంజయ్ మహంతి, శ్రీ మహంతి ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నిర్వహిస్తున్న విశాఖ డాన్స్ అకాడమీ బృందంచే భరతనాట్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందుగా సంస్థ అధ్యక్షులు డాక్టర్ ఎంవి.సూర్యనారాయణరాజు అతిథులకు స్వాగతం పలుకుతూ కళలు సంస్కృతికి ప్రతిబింబాలని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. అనంతరం లక్ష్మీ మహంతి, శంకర్ మహంతిలు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కెవికె.మూర్తిరాజు, కోశాధికారి డాక్టర్ ఎఎస్ఎన్.రాజు, సంయుక్త కార్యదర్శి గుర్రం శ్రీనివాసరావు, వానపల్లి బాబురావు, సన్నిధి రామ్ వెంకటేశ్వరరావు, సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి 50 సిమెంట్ బస్తాలు

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని మట్టపర్రులో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి స్థానిక ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ధర్మారావు ఫౌండేషన్ ద్వారా 50 సిమెంట్ బస్తాలను ఆదివారం ధర్మారావు ఫౌండేషన్ సభ్యులు ఆలయ నిర్మాణ కమిటీకి అందించారు. ఈ కార్యక్రమంలో పీతల శ్రీను, రావూరి అప్పారావు, మేడిశెట్టి కేశవ, మట్టపర్రు సర్పంచి దొమ్మేటి శ్రీను, కేతా హరికృష్ణ, ఏళ్లమెల్లి వెంకట్రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

మొగల్తూరులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల కేంద్రమైన మొగల్తూరులోని పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 2001- 2002 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుని కుశల ప్రశ్నలు వేసుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమ సహచరుల్లో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఇద్దరికి వారు రూ.52 వేలు సమకూర్చారు. ఒక్కొక్కరికి రూ.26 వేల చొప్పున అందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాల ఆవరణలో గడిపి ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాఠశాల ఆవరణలో సహపంక్తి భోజనాలు చేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

ఆన్‌లైన్ మోసం : రూ.1.81 లక్షలు మాయం

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల ఆన్‌లైన్ మోసంతో ఓ వ్యక్తి రూ.1,81,200 పోగొట్టుకున్న సంఘటన మండలంలోని పెదపుల్లేరులో చోటుచేసుకుంది. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెదపుల్లేరు గ్రామానికి చెందిన కలిదిండి బలరామకృష్ణంరాజు సెల్‌ఫోన్‌కు కరెంటు బిల్లు రూ.1,81,200 కట్టాలని మెసేజ్ రాగా ఆ నెంబర్‌కు తిరిగి ఫోన్ చేశాడు. ఫోన్ పే నుంచి రూ.5 వేస్తే పరిశీలించి తిరిగి రూ.5 వేస్తామని చెప్పగా బలరామకృష్ణంరాజు రూ.5 వేశాడు. అలా చేయగానే తన యూనియన్ బ్యాంక్ ఖాతా నుంచి రూ.1,81,200 పోగొట్టుకున్నాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా ఉండి ఎస్ఐ కె.గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

మహిళపై లైంగిక వేధింపులు : వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - ఉండి

మహిళను లైంగికంగా వేధిస్తున్న వ్యక్తిపై ఉండి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాందువ్వ గ్రామంలో గురువిల్లి నాగమణి నివాసం ఉంటుంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన సనపల విశ్వనాథుడు అలియాస్ అప్పలనాయుడు తన కోరిక తీర్చమంటూ అర్ధరాత్రులు తలుపులు కొడుతూ లైంగికంగా వేధిస్తున్నాడని నాగమణి ఆదివారం ఉండి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.గంగాధరరావు తెలిపారు.

శిక్షణా తరగతులు.. ఆశాల అవస్థలు

సరైన వసతులు కరువు

నాణ్యతలేని భోజనం పెడుతున్నారని ఆవేదన


వీరవాసరంలో శిక్షణ కేంద్రం వద్ద భోజనం చేస్తున్న ఆశావర్కర్లు

ప్రజాశక్తి - వీరవాసరం

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇటీవల కొత్తగా చేరిన ఆశావర్కర్లకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. సరైన వసతులు లేని ప్రాంతాన్ని శిక్షణా కేంద్రంగా ఎంపిక చేయడం చేశారని ఆశావర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో తడికలపూడి వద్ద నిర్వహించే ఈ శిక్షణా తరగతులు జిల్లాలు విడిపోవడంతో పశ్చిమగోదావరి జిల్లా వారికి వీరవాసరం పిహెచ్‌సి కేంద్రంగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. నెల రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ తరగతులకు సరైన ఏర్పాట్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆశావర్కర్లు వాపోతున్నారు. శిక్షణ సమయంలో చేయాల్సిన ఏర్పాట్లకు ఆ శాఖలోని జిల్లాస్థాయిలో ఒక అధికారి కాంట్రాక్టు తీసుకున్నట్లు చెబుతున్నారు. వీరవాసరంలో శిక్షణా తరగతులు నిర్వహిస్తుంటే ప్రతి రోజు తణుకు నుంచి భోజనాలు వస్తున్నట్లు సమాచారం. అది కూడా రుచిపచిలేని భోజనం పెడుతున్నారని ఆశావర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి శిక్షణా కేంద్రానికి ఉదయం తొమ్మిది గంటలకు చేరుకోవడానికి వ్యయప్రయాసాలకు లోనవుతున్నట్లు చెబుతున్నారు. సక్రమంగా లేని రోడ్లతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వీరవాసరానికి నేరుగా బస్సు సదుపాయం లేకపోవడంతో వారు పడుతున్న అవస్థలు వర్ణానీతంగా ఉన్నాయి. అన్ని సదుపాయాలకు అనుకూలంగా ఉన్న జిల్లా కేంద్రం భీమవరంలో కాకుండా వీరవాసరంలో శిక్షణా తరగుతులు నిర్వహించడలో ఉన్న ఆంతర్యం ఏమిటన్నది జిల్లా అధికారులకే తెలియాలన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. కొంత మంది ఆశావర్కర్లకు ఇంటి వద్ద చిన్న పిల్లలు ఉండడంతో ప్రతి రోజు ఇంటికి వెళ్లి వచ్చేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలిపారు. శిక్షణా తరగతులకు వచ్చే వారికి రానుపోను ఛార్జీలు చెల్లిస్తారో లేదోనన్నది స్పష్టత లేదు. మొదటి రోజు, చివరి రోజుకు మాత్రమే ఛార్జీలు చెల్లిస్తారని ఆశావర్కర్లు చెబుతున్నారు. తినడానికి అనువుగా లేని ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్ పట్ల కూడా ఆశలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రుచి లేని భోజనం వల్ల ఇంటి వద్ద నుంచే తెచ్చుకోవాలని ఆలోచనలో ఉన్నట్లు ఆశలు తెలిపారు. ప్రస్తుతం శిక్షణ తీసుకుంటున్న ఆశల ఇబ్బందులపై జిల్లా అధికారులు దృష్టిపెట్టి వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని సరైన సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

గోపిని కలిసిన వైసిపి నేతలు

ప్రజాశక్తి - పాలకొల్లు

వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నూతనంగా నియమితులైన గుడాల గోపి ఆదివారం పాలకొల్లు ఎఎంసికి విచ్చేశారు. ఈ సందర్భంగా గోపిని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, చందక సత్తిబాబు, మైకేల్‌రాజు, చెన్ను విజయ్, చినమిల్లిశాఖ గణపతి, పాలపర్తి కృపానాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణ సిఐ డి రాంబాబు, ఎస్ఐలు బాదం శ్రీనివాస్, ముత్యాలరావు ఆయనను అభినందించారు.

నూతన కార్యాలయం కోసం అన్వేషణ

గుడాల గోపి నూతన కార్యాలయం కోసం అన్వేషణ చేస్తున్నారు. ప్రస్తుతం కవురు శ్రీనివాస్ కార్యాలయం పెద్ద సాయిబాబా ఆలయం వద్ద ఉంది. అయితే తనకంటూ కార్యాలయం ఉండాలని అన్వేషిస్తున్నారు. గోపి నియామకం గురించి వార్తలు వెలువడి నెల కావస్తుంది. దీంతో నియోజకవర్గంలోని రెండో క్యాడర్‌లో బేధాలు వచ్చాయి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ టిడిపి మహిళా శక్తి పేరుతో నియోజకవర్గంలో దూసుకుపోతున్న నేపథ్యంలో వైసిపిలో ఇంకా అంతర్గత కుమ్ములాటలు సమసిపోలేదని పలువురు అంటున్నారు.

'వాలంటీర్లపై పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు సరికావు'

ప్రజాశక్తి - ఉండి

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విశాఖ పర్యటనలో భాగంగా వాలంటీర్లను దండుపాళ్యం బ్యాచ్‌తో పోల్చడంపై వైసిపి జిల్లా అధికార ప్రతినిధి బడుగు బాలాజీ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల వరుసగా పవన్‌కల్యాణ్ వాలంటీర్లను లక్ష్యంగా చేసుకుని అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నాడని, కేవలం రూ.ఐదు వేల గౌరవ వేతనంతో ప్రజలకు నిస్వార్థంగా సేవలు చేస్తున్న వాలంటీర్లపై ఇటువంటి వ్యాఖ్యలు సరికావన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని మోసం చేస్తున్న బిజెపిపై తన ప్రతాపం చూపించాలన్నారు. బిజెపితో పోట్లాడి ప్రత్యేక హోదా తెస్తే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. అంతేగాని అమాయకులైన వాలంటీర్లపై తన ప్రతాపం చూపించడం సరికాదన్నారు. గత ప్రభుత్వం హయాంలో చింతమనేని ప్రభాకర్ తహశీల్దార్ వనజాక్షిపై దాడికి దిగినప్పుడు పవన్‌కల్యాణ్ ఏం చేశాడని ప్రశ్నించారు. నాగార్జున యూనివర్సిటీలో విద్యార్థిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తే ఆనాడు చంద్రబాబునాయుడును ప్రశ్నించలేదన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణపై మాట్లాడలేక పవన్‌కల్యాణ్ విశాఖపట్నం పర్యటనలో వాలంటీర్లపై విరుచుకుపడుతూ మతిస్థిమితం లేని మాటలు మాట్లాడుతున్నారన్నారు.

ఎఎస్ఎన్ఎం కళాశాలకు నాక్ బి ప్లస్ గ్రేడ్

ప్రజాశక్తి - పాలకొల్లు


పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పాలకొల్లు శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ బి ప్లస్ గ్రేడ్ లభించింది. 2017లో నాక్ బి గ్రేడ్ ఉండగా ఇప్పుడు అత్యుత్తమ పనితీరు, మెరుగైన వసతుల కల్పన విద్యాబోధనలతో బి ప్లస్ గ్రేడ్ సొంతమైంది. 55 సంవత్సరాల చరిత్ర కలిగి జిల్లాలోని ఏకైక ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి హోదా కలిగిన కళాశాలగా గుర్తింపు పొంది నాక్ బి ప్లస్ గ్రేడ్ గుర్తింపు రావడంపై కళాశాల సిబ్బంది, పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిష్టాత్మక కళాశాలలో మారుతున్న కాలానుగుణంగా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో వసతులు కల్పించారు. వర్చువల్ క్లాస్ రూమ్‌లతో, సీసీ కెమెరాలు అత్యాధునిక ల్యాబ్స్, లైబ్రరీలను ఏర్పాటు చేశారు. కళాశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో ఇటీవల జరిగిన నాక్ పర్యటనలో బి ప్లస్ గ్రేడ్ లభించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ నాక్ బి ప్లస్ గ్రేడ్ సాధించడానికి సహాయపడిన అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు, పూర్వ విద్యార్థుల సంఘం అందరికి ధన్యవాదాలు తెలిపారు.

యూత్ హాస్టల్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - భీమవరం రూరల్

యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. భీమవరం కృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ వివిజె.సోమరాజు, ఛైర్మన్‌గా సిహెచ్.రవిపాల్, వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ కె.కొండయ్య, అబ్దుల్ ఖలీల్, ఆర్‌విఎన్.జగపతిరాజు, కోశాధికారిగా ఇ.శ్రీనివాస్, ఆర్గనైజర్ సెక్రటరీగా డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ, కార్యదర్శిగా ఎండి ఇబ్రహీం, ఎపిసి ఛైర్మన్‌గా సత్యానందం ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు ఘనంగా సత్కరించారు. ఇచ్చిన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించి అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ హాస్టల్స్ సభ్యులు నందమూరి రాజేష్, మట్లపూడి సత్యనారాయణ, జానపటి మధుసూదన్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


తలసేమియా రోగులకు రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సిఐ శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తలసేమియా వ్యాధి గ్రస్తుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని వన్‌టౌన్ సిఐ అడబాల శ్రీనివాస్ అన్నారు. స్థానిక భీమేశ్వరస్వామి రోడ్డులో ఆదివారం ఆర్ఆర్, ఫ్రెండ్స్ సేవా సమితి భీమవరం వారి ఆధ్వర్యంలో రక్తమే ప్రాణాదారంగా జీవిస్తున్న తలసేమియా వ్యాధి గ్రస్త చిన్నారుల కోసం స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఆనంద బ్లడ్ బ్యాంక్ వారిచే ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన కార్యక్రమంలో 15 మంది దాతలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భీమవరం వన్‌టౌన్ సిఐ అడబాల శ్రీను, సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి హాజరయ్యారు. సిఐ మాట్లాడుతూ తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం చాల అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. రంగసాయి మాట్లాడుతూ ఈ సంస్థకు ప్రతిఒక్కరూ సహాయ సహకారలు అందించాలని కోరారు. సంస్థ నిర్వాహకులతో ప్రాణాపాయంలో ఉన్నవారిని ఆదుకుంటామని ప్రమాణం చేయించారు. సంస్థ గౌరవ అధ్యక్షులు ఆనందరఘువర్మ రక్తదనం చేసినవారికి ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో భీమవరం పట్టణ తూర్పు కాపు సంఘ సహాయ కార్యదర్శి తాళ్లపూడి పరమేశ్వరరావు, గెద్దా రామారావు, కొడమంచలి సిద్దయ్య, ఋరిడి సత్యవరప్రసాద్, తోట శ్రీనివాసు, మామిడిపల్లి వినయ్‌కుమార్, కారుమూరి సతీష్, కోరాడ అప్పలనాయుడు. పొన్నాడ రామారావు, జలసూత్ర శివ పాల్గొన్నారు.

ఘనంగా 'సూర్యమిత్ర' రజతోత్సవం


సూర్యారావును సత్కరిస్తున్న స్టాఫ్ ట్రేడర్స్‌చ రైతులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పనిపట్ల అంకిత భావం, వ్యాపారంలో నాణ్యత, నమ్మకం సమస్త అభివృద్ధికి విజయసంకేతమని, సర్యమిత్ర రజతోత్సవానికి చిహ్నమని సూర్యమిత్ర ఎగ్జిమ్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ ఛైర్మన్ డాక్టర్ యిర్రింకి సూర్యారావు అన్నారు. భీమవరంలో సూర్యమిత్ర ఎగ్జిమ్ ప్రయివేట్ లిమిటెడ్ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం రెండో పట్టణంలోని ఆనందఇన్‌లో సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు విచ్చేశారు. సూర్యారావు వ్యాపార విధానాలు, నిబద్ధత వల్లే ఆయన వ్యాపార సంస్థ ఈ స్థాయికి వచ్చిందని అభినందించారు. డాక్టర్ ఇర్రింకి సూర్యారావు మాట్లాడుతూ 25 వసంతాలు పూర్తి చేసుకున్న తమ సంస్థకు సహకరించిన ఆక్వా రైతులకు, హేచరీస్ వారికి, కంపెనీ సిబ్బందికి, కుటుంబ సభ్యులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులందరికీ అభినందనలు తెలిపారు. ఈ ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నానని, 1998లో ప్రారంభించినప్పుడు సంస్థ చిన్న స్థాయి నుంచి దినదిన అభివృద్ధి చెందిందన్నారు. ప్రస్తుతం కొన్ని వేల కుటుంబాలు సూర్యమిత్ర సంస్థపై ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి పొందుతున్నాయన్నారు. వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలను కూడా కంపెనీ అందిస్తుందన్నారు. భారతదేశంలోనే టాప్ టెన్‌లో ఉన్న సంస్థ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. సంస్థ సిఇఒ ఇర్రింకి గంగారామ్ మాట్లాడుతూ ట్రేడర్‌గా చిన్న వ్యాపారాన్ని ప్రారంభించి నీతి నిజాయితీతో వ్యాపారం నిర్వహిస్తూ, వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధిని కల్పిస్తూ ప్రముఖ ఎక్స్‌పోర్ట్ సంస్థగా ఎదిగిన సూర్యమిత్ర నేడు భారతదేశంలోనే అత్యున్నత స్థానంలో ఉందన్నారు. అనంతరం ఆక్వా రైతులు, ట్రేడర్లు, సహా ఎగుమతి దారులు, బ్యాంకర్లు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి డాక్టర్ సూర్యారావును ఘనంగా సత్కరించారు.

సూర్యారావుకు ఘనసత్కారం

సూర్యమిత్రను అభివృద్ధిలో ముందు తీసుకు వెళ్లడం కాకుండా, తమను కూడా అభివృద్ధి వైపు అడుగులు వేయించిన సూర్యారావును అటు కుటుంబ సభ్యులు, ఇటు సూర్యమిత్ర సిబ్బంది, ట్రేడర్స్, ఏజెంట్లు, రైతులు, స్నేహితులు, అభిమానులు, దుశ్శాలువతో పాటు, గజమాల, పూల కిరీటంతో ఘనంగా సత్కరించారు.

ఆ గ్రీన్ వెహికల్స్ ఏమయ్యాయి!

రూ.40 లక్షలు విలువైన వాహనాలు

శిథిలావస్థకు కొన్ని.. మిగతావి మాయం


పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో పాడుబడిన గ్రీన్ వెహికల్స్

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడు నగర పంచాయతీ వద్ద గ్రీన్ వెహికల్స్ ఏమయ్యాయనేది తెలియని పరిస్థితి. సుమారు రూ.40 లక్షల విలువైన గ్రీన్ వెహికల్స్ మాయమైపోయాయి. ఈ పట్టణం నగర పంచాయతీగా మారి రెండున్నరేళ్లయింది. అంతకుముందు మేజర్ పంచాయతీగా ఉండగా రాష్ట్రంలోనే అతిపెద్ద పంచాయతీగా ఉంది. ఆ సమయంలో సుమారు ఐదేళ్ల క్రితం పంచాయతీకి రాష్ట్ర ప్రభుత్వం ఈ గ్రీన్ వెహికల్స్ సరఫరా చేసింది. పచ్చదనం, పరిశుభ్రత పరిరక్షణ కోసం పారిశుధ్య రక్షణ కోసం ఈ వాహనాలను పంపారు. పెట్రోల్ ఖర్చు లేకుండా విద్యుత్ బ్యాటరీతో నడిచే వాహనాలను ఒక్కొక్క పారిశుధ్య కార్మికుడికి ఒక్కొక్కటి చొప్పున అందించారు. వాహనం ఒక్కొక్కటి సుమారు రూ.రెండు లక్షలు ఉండగా అందులో సగం రాయితీ పోగా మిగిలిన సగం ఆ కార్మికుడు బ్యాంకుకు చెల్లించాల్సి ఉంటుంది. ఆ బ్యాంకులకు ఈ స్థానిక స్వపరిపాలన సంస్థ హామీగా ఉంటుంది. అంటే పారిశుధ్య కార్మికుడు చెల్లించకపోతే నాటి పంచాయతీ చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పుడు నాటి కార్మికులు లేరు, వాహనాలు లేవు. ఆ వాహనాలు వాడుకలో ఉంటే నగర పంచాయతీకి ఏటా రూ.లక్షలు ఆదా అయ్యే అవకాశం ఉంది. ఆ వాహనాల్లో కొన్ని పంచాయతీ కార్యాలయం వెనుక చెత్తకుండీలో చేరాయి. మిగిలినవి ఏమయ్యాయో ఎవరికీ తెలీదు. ఆ వాహనాలపై కార్మికులు పూర్తిగా సొమ్ము చెల్లించి ఉంటే వాటిపై వారికి హక్కు ఉంటుంది. అయితే వారి వద్ద ఆ వాహనాలు ఉంటే మళ్లీ ప్రత్యేకించి ట్రాక్టర్లను నగర పంచాయతీ కాంట్రాక్ట్ తీసుకోవాల్సిన అవసరం లేదు. కొత్తవి కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. అందుకు విరుద్ధంగా ప్రస్తుతం కొన్ని వాహనాలు కాంట్రాక్ట్‌కు తీసుకోగా మరో మూడు కొత్త వాహనాలు కొనుగోలు చేశారు. పాత వాహనాల పరిస్థితి తమకు తెలియదంటే తమకు తెలియదని ఎవరికి వాళ్లు చేతులు దులుపుకుంటున్నారు. రూ.40 లక్షల విలువైన వస్తువులు ఏమయ్యాయో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 14వ తేదీన విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సురేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్టేరు 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో గల నెలమూరు ఫీడర్‌లో మెయింటెనెన్స్ కారణంగా సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, సత్యవరం, కోయేటిపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

టిడిపి విజయానికి కృషి చేయాలి : నిమ్మల

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని జిన్నూరు, కొమ్ముచిక్కాల, వేడంగి, వేడంగిపాలెం గ్రామాల్లో స్థానిక ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో ఆదివారం గ్రామస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ అనుబంధ కమిటీలైన సేవా మిత్ర, సాధికార మిత్ర, తెలుగు యువత, ఐటిడిపి నాయకులు మినీ మేనిఫెస్టోను ప్రతి ఇంటికి తీసుకువెళ్లి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.

ఉండిలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - ఉండి

ఉండి గ్రామంలోని రాజులపేట, గౌడ వీధి, కుంట, బాలాజీరావుపేట, భవానీపేట, రామాపురం తదితర ప్రాంతాల్లో తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు వత్సవాయి సుజాత ఆధ్వర్యంలో ఆదివారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలకు తెలుగుదేశం ప్రభుత్వం వస్తే ఇచ్చే సంక్షేమ పథకాలకు తేడా వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, టిడిపి సీనియర్ నాయకులు జుత్తిగ శ్రీనివాస్, కందుల బలరాం, కేశన యాదగిరి, కిన్నెర వెంకన్న, చెన్నంశెట్టి హరినాయుడు, పెద్దింటి నాగలక్ష్మి పాల్గొన్నారు.